

నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి

తానూర్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఏపీవో శివలింగం అన్నారు. తానూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఉపాధిహామీ సిబ్బందికి ఏపీవో శివలింగం, ఎంపీవో అనంత విశ్వేశ్వరరావు వారాంతపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో శివలింగం, ఎంపీవో అనంత విశ్వేశ్వరరావు మాట్లాడారు. గ్రామాల్లో పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీవో అనంత విశ్వేశ్వరరావును ఘనంగా సన్మానించారు.

20 నెలల్లో రూ.792 కోట్లు



- ఆంక్షల నుంచి అధికారిక నివాళుల వరకు సీఎం రేవంత్ ఘనత
- త్వరలో నాలుగు ఐరన్ బ్రిడ్జిలతో అడవి బిడ్డలకు 'రాస్తా' సుగమం
- నాకు వ్యక్తులు, ప్రాంతంపై విభేదాలు లేవు
- తప్పు చేయను.. అభివృద్ధి కోసం ఎవరికైనా నిలదీస్తా
- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఖానాపూర్ అభివృద్ధికి నిధుల వరద

సామాన్య కుటుంబం నుంచి వచ్చి.. ఖానాపూర్ ఎమ్మెల్యే విజయ దుందుభి మోగించారు వెడ్మబొజ్జు పటేల్. ఫైర్ బ్రాండ్‌గా ముద్ర వేసుకున్న ఆయన తన 20 నెలల పాలనలో ఆయన సాధించిన ఘనత .. ప్రజలకు చేరువైన తీరు, సాధించాల్సిన అభివృద్ధిపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక ఇంటర్వ్యూ..

- ఖానాపురం, ఆంధ్రజ్యోతి

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ఇంద్రవెల్లి అమరుల కుటుంబాలను ఆదుకున్నారా..?

ఎమ్మెల్యే: దళిత గిరిజన దండోరాలో పీసీసీ అధ్యక్షుడిగా ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిన ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశాం. గత ప్రభుత్వాల ఆంక్షల నుంచి ప్రస్తుత ప్రభుత్వం అధికారిక నివాళులర్పించే వరకు ప్రతీది సీఎం ఘనతే. అమరుల 15 కుటుంబాలకు ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధికి ప్రతీ కుటుంబానికి రూ.10 లక్షల రుణం, రూ.1.20 కోట్లతో ఇంద్రవెల్లిలో అమరుల స్మృతి వనం నిర్మించాం.

నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు తెచ్చారు..?

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలో 20 నెలల కాలంలో రూ.792 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాం. మరమ్మతులకు నోచుకోక రైతులు క్రాప్ హాలిడే ప్రకటించిన కడెం ప్రాజెక్టును రూ.9.36కోట్లతో మరమ్మతులు చేశాం. 68 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నాం.

పల్లెలకు రహదారి సౌకర్యం కల్పిస్తున్నారా?

గంగాపూర్ వంతెనకు రూ.22కోట్లు మంజూరయ్యాయి. పనులు ప్రారంభమయ్యాయి. వంతెనల పునర్నిర్మాణం కోసం రూ. 5.40 కోట్లు మంజూరు చేయించా. గుమ్మెన- ఎంగ్లాపూర్ మధ్య దొత్తివాగు పై, యాపల్ గూడ-రాంనగర్ మధ్యలో, నర్సాపూర్ (జే) వద్ద, వంకతుంగ వద్ద మొత్తం నియోజకవర్గంలో నాలుగు ఐరన్ బ్రిడ్జిలు నిర్మిస్తాం. ఇందుకు రూ. 17 కోట్లతో ప్రపోజల్స్‌ని పెట్టాం. త్వరలోనే నిధులు మంజూరు అవుతాయి.

ఎన్నికల హామీలు సాకారం అవుతున్నాయా?

ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేస్తాం. ఆదిశగా సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో ముందుకు సాగుతున్నాం.

ప్రజలకు అందుబాటుల ఉంటున్నారా?

ఎమ్మెల్యేగా ప్రతీ కార్యకర్తతో , ప్రజలతో నాకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మండలాల వారీగా నిత్యం ఏదో ఒకచోట నిద్ర చేస్తున్నాను. ఖానాపూర్‌లో వారానికి మూడు రోజులు అందుబాటులో ఉంటున్నాను. శుక్ర, శని, ఆదివారాలలో క్యాంపు కార్యాలయంలో ఉంటున్నాను. రాజకీయ పబ్బం కోసమే కొంతమంది యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌పై విమర్శలు చేస్తున్నారు. నాకు ఎవరితోనూ విభేదాలు లేవు.

ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయా?

ఇళ్ల విషయంలో దళారులను నమ్మొద్దు. అనర్హులకు ఇళ్లు వస్తే రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే వారిని తొలగిస్తాం.



రానున్న ఎన్నికల్లో ఏవిధమైన పాత్రను పోషిస్తారు ?

సీఎం రేవంత్ రెడ్డి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ ఆదేశాలను తూచా తప్పకుండా పాటిస్తూ పని చేస్తా. నా నియోజకవర్గంతో పాటు ఇతర నియో జకవర్గాల్లో బాధ్యతను అప్పగిస్తే అందరిని సమన్వయం చేస్తా. ఖానాపూర్ మున్సిపాలిటీతో పాటు అన్ని ఎంపీటీసీ, జడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలను కైవసం చేసుకునేలా కార్యకర్తల్లో చైతన్యం తెస్తా.

దూకుడుగా వ్యవహరించడంలో అంతర్యం..

దూకుడుగా వ్యవహరించడం అనేది చిన్ననాటి నుండి నాకున్న నైజం. నేను ఎక్కడ తప్పు చేయను కాబట్టి ఎవరికి తలవంచను.

కడెం హరిత రిసార్ట్ విషయంలో మౌనమెందుకు?

నిబంధనలను పట్టించుకోని నిర్వాహకులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది. లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు అనుమతులు వచ్చాయి. సదర్మాట్ కెనాల్‌కు మరమ్మతులు నిర్వహించి చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం.

పోడు సమస్యకు పరిష్కారం ఎలా చూపుతారు?

పోడు భూములు ఉన్న వారందరికీ హక్కులు ఉన్నాయి. కొందరు అధికారుల తీరు మారాలి.

కార్యకర్తలకు ప్రాధాన్యం ఇస్తున్నారా?

కాంట్రాక్ట్‌లు టెండర్ ప్రకారం దక్కుతాయి. నామినేటెడ్ పనుల్లో కార్యకర్తలకే ప్రాధాన్యంఇస్తా. జిల్లా, రాష్ట్ర స్థాయిలో వచ్చే నామినేటెడ్ పోస్టుల విషయంలో సైతం సీనియర్ కార్యకర్తలకు న్యాయం జరుగుతుంది. నేను తప్పు చేయను. ప్రజల కోసం ఎవరినైనా ఎదిరిస్తా.

యూరియా కొరత ఉందా?

యూరియా కొరత లేదు. కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారు. అవసరానికి మించి కొంతమంది కొనుగోలు చేయడంతోనే కృత్రిమ కొరత ఏర్పడింది.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

బ్యాంకింగ్ సేవలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

- లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్‌గోపాల్

సోన్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్మల్ బొప్పారం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో శుక్రవారం బాలశక్తి కార్యక్రమంలో భాగంగా బ్యాంకింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌డీఎంరామ్‌గోపాల్ మాట్లాడుతూ విద్యార్థులు రోజువారీ బ్యాంకు లావాదేవీలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్, ఏటీఎం వినియోగం, పాయింట్ ఆఫ్ సేల్ (పీవోఎస్) సూచించారు. విద్యార్థులను సమీప బ్యాంకులకు తీసుకెళ్లి అక్కడి లావాదేవీలను ప్రత్యక్షంగా చూపించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బందితోపాటు వివిధ బ్యాంకుల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలి

లక్ష్మణచాంద,సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో రాధారాథోడ్ ఆదేశించారు. మండలంలోని పార్‌పెల్లి గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ లబ్ధిదారులతో, మేస్త్రీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల బేస్మెంట్లను పూర్తిచేసి నిర్మాణాలను పూర్తిచేయాలని సూచించారు. మండలంలో ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్లకు రూ. 45లక్షలు మంజూరైనట్లు చెప్పారు. అనంతరం పొట్టపెల్లి గ్రామ ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలను పెట్టి సంరక్షించినందుకు ప్రధానోపాధ్యాయులు జయశ్రీని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి, ఐకేపీ సిబ్బంది, జిల్లా అధ్యక్షురాలు గంగామణి పాల్గొన్నారు.

రైతుల కష్ట ఫలితాన్ని రైతులకే అందించాలి

- భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు జోగినిపల్లి శ్రీ రంగారావు



సమావేశానికి హాజరైన సంఘ్ ప్రతినిధులు

ముథోల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అక్టోబరు మొదటి వారంలోనే సోయా కొనుగోళ్లను ఏర్పాటు చేసి రైతుల కష్ట ఫలితాన్ని రైతులకే అందేలా చర్యలు తీసుకోవాలని భారతీయ రాష్ట్ర కిసాన్ సంఘ్ అధ్యక్షుడు జోగినిపల్లి శ్రీరంగారావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లోని పశుపతినాథ్ శివాలయం ఆవరణలో శుక్రవారం భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భైంసాడివిజన్ రైతుల ఆత్మీయసమ్మేళనం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సోయా కొనుగోలు కేంద్రాలు ఆలస్యంగా ఏర్పాటుచేస్తే, చేతికి వచ్చిన సోయా పంట నిల్వ చేసే సౌకర్యం లేక, తదుపరి పంటకు పెట్టుబడి అవసరమై ప్రైవేట్, మధ్యవర్తులకు తక్కువ ధరకే పంటను అమ్మి రైతు నష్టపోతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు ఈ సమస్యపై సత్వరమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆకస్మిక వరదల వల్ల పంట పొలాలు మునిగిపోయి చాలా నష్టానికి గురి అయ్యారని, వారిని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. భారతీయకిసాన్‌సంఘ్ గ్రామగ్రామాన రైతులను కలుస్తూ నిస్వార్థంగా ఎలాంటి ప్రయోజనాలు ఆశించకుండా రైతుల శ్రేయస్సు కోసం పని చేసే కార్యకర్తలను నిర్మాణం చేస్తుందన్నారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులందరూ రెండు తీర్మానాలు చేశారు. మొదటిది సోయా కొనుగోలు కేంద్రాలు ఎప్పుడు ఏర్పాటు చేస్తారో ప్రభుత్వం ప్రకటన చేయాలని తీర్మానం చేశారు. రెండవది వర్షం నష్టపరిహారం వెంటనే విడుదల చేయాలని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ సంఘటన మంత్రి దోనూరు రాము, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబిర్ ఆనంద్ రావు, భైంసా డివిజన్ అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ కమిటీల అధ్యక్ష, కార్యదర్శులు, రైతులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

నిర్మల్ రూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని శ్రీ నంది గుండం దుర్గామాత ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఉత్సవాల ఫ్లెక్సీ ఆవిష్కరించారు. ఈనెల 22న నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమవుతాయని, ఆలయంలో భవాని మాలధారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు అన్నప్రసాద వితరణ ఉంటుందని, భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్కడి జగన్మోహన్ రెడ్డి, పూదరి నరహరి, విలాస్, మూర్తి మాస్టర్, సద్దాం ఆనంద్, శివ కుమార్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



నవరాత్రి వేడుకల ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

గడ్డెన్నవాగు ప్రాజెక్టు గేట్ల మూసివేత

భైంసా, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గడ్డెన్నవాగు ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గింది. దీంతో అధికారులు శుక్రవారం నీటి విడుదలను నిలిపివేశారు. గురువారం వేకువజాము ప్రాజెక్టులోకి 13వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగగా 2వరద గేట్ల ద్వారా సుద్దవాగులోకి అంతేమొత్తంలో వరదనీటిని వదిలివేశారు. మధ్యాహ్నం వేళ నుంచి ఇన్‌ఫ్లో క్రమంగా తగ్గుతూపోయింది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం ఒక వరద గేట్‌ను మూసి వేసిన అధికారులు శుక్రవారం మరో వరద గేట్‌ను సైతం మూసివేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి: డీపీవో

సారంగాపూర్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా వారోత్సవాల్లో భాగంగా ఎంపీవో అజీజ్‌ఖాన్‌తోపాటు పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, స్వచ్ఛభారత్‌ను నిర్వహించారు. సందర్భంగా గ్రామస్తులకు స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు.

కుస్లీ రోడ్డుకు మరమ్మతులు

నర్సాపూర్(జి), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణ పనులను అధికారులు వేగవంతం చేశారు. కలెక్టర్ అభిలష అభినవ్ ఆదేశాల మేరకు నర్సాపూర్ మండలంలోని కుస్లీ గ్రామానికి వెళ్లే రహదారిపై తాత్కాలిక మరమ్మతులు ప్రారంభించారు. వర్షాలతో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా ప్రజల రవాణా సమస్యలు తొలగించడమే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నుల పంపిణీ

భైంసారూరల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోతుల్‌గాం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు ఎంపీవో చంద్రశేఖర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని వర్కర్లకు సూచించారు. అంగన్‌వాడీ సెంటర్‌ను కూడా పరిశీలించారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి, పంచాయతీ కార్యదర్శికి తగు సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, చత్రాజి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలి

సారంగాపూర్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆయా గ్రామాలకు చెందిన 18 నుంచి 30 సంవత్సరాల మధ్య గల మహిళలు మహిళా కమ్యూనిటీ హెల్త్ వర్కర్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని మహిళ ప్రాంగణం మేనేజర్ విజయలక్ష్మీ శుక్రవారం ఒక ప్రకటలో తెలిపారు. పదో తరగతి మెమో, ఆధార్‌కార్డు, నాలుగు పాస్ ఫొటోలు జిరాక్స్ కాపీలతో మహిళా ప్రాంగణంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 7660022506 నెంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై పిల్లలకు అవగాహన కల్పించాలి

ఖానాపూర్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలని ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాడ్ అన్నారు. మండలంలోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం నిర్మల్ భరోసా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోక్సో యాక్ట్, బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భరోసా బృందం సభ్యులు సుకన్య, శిరీష, పాఠశాల ప్రత్యేక అధికారి సునీత, తదితరులున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

నిర్మల్‌రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన సందర్భంగా సేవా పక్వాడ కార్యక్రమంలో బీజేపీ, జిల్లా మహిళా మోర్చా ఆధ్వర్యంలో పట్టణంలోని విజయ హైస్కూల్‌లో పిల్లలకు చిత్రలేఖన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య, జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలు మంగ, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ ఆడెపు లలిత, మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు సామ భూలక్ష్మి, బీజేపీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

పెండింగ్ నిధులను వెంటనే విడుదల చేయాలి

- కలెక్టర్‌కు మాజీ జెడ్పీటీసీల విన్నపం



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాజీ జెడ్పీటీసీలు

నిర్మల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): 2023-24 సంవత్సరానికి జిల్లాలో అభివృద్ధి పనుల తాలూకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని జిల్లాకు చెందిన తాజా మాజీ జడ్పీటీసీల బృందం డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ అభిలాష అభినవ్‌ను కలిసిన తాజా మాజీ జడ్పీటీసీలు పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023-24 సంవత్సరంలో ఎస్ఎఫ్‌సీ నిధుల ద్వారా చేపట్టిన పనుల తాలూకు బిల్లులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. పనులు పూర్తిచేసి రెండేళ్లు కావస్తున్నా జిల్లా వ్యాప్తంగా రూ. 6.31 కోట్ల బిల్లులు మంజూరుకి నోచుకోవడం లేదన్నారు. పనులు పూర్తి చేసి రెండేళ్లు గడవడంతో పాటు తమ పదవీకాలం సైతం ముగిసిపోయి 15నెలలు గడుస్తోందని అయినా నిధులు విడుదల కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే పెండింగ్ బిల్లులను మంజూరు చేసేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జడ్పీటీసీల ఫోరం మాజీ జిల్లా అధ్యక్షుడు పత్తి రాజేశ్వర్ రెడ్డి, సోన్ మండల మాజీ జడ్పీటీసీ సభ్యుడు జీవన్ రెడ్డి, అరుగుమీది రామయ్య, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ లోలం శ్యాంసుందర్, లక్ష్మణచాంద మాజీ జడ్పీటీసీ సభ్యుడు ఓస రాజేశ్వర్, మాజీ డీసీసీబీ చైర్మన్ రామ్‌కిషన్ రెడ్డి, బాసరకు చెందిన రమేష్, తదితరులున్నారు.

ఉపాధ్యాయులకు ప్రశంసా పత్రాలు

ముథోల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ హిందీ విద్యా సంస్థాన్ హైదరాబాద్‌లో జరిగిన 12 రోజుల ప్రశిక్షణ కార్యక్రమంలో నిర్మల్ జిల్లాకు చెందిన 28 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన పోటీలలో ఆధునిక భాషాశిక్షణలో సవాళ్లు, పరిష్కారాలు అనే అంశంపై విజేతలుగా నిలిచిన ఉపాధ్యాయులకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో మొదటి స్థానంలో జిల్లాకు చెందిన శశిరాజ్ (ఎస్ఏ జెడ్పీఎస్ఎస్ ఆష్టా, మండలం ముథోల్), శివకుమార్ రెండోస్థానం, రమాదేవి మూడోస్థానంలో నిలిచారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందించారు.

పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి

లక్ష్మణచాంద, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి ఆదేశించారు. మండలంలోని వడ్యాల్ గ్రామంలో గల ఉన్నత పాఠశాలను ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిని, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో గల రికార్డులను పరిశీలించారు. 100శాతం హాజరు నమోదు కోసం కృషి చేయాలని, పకడ్బందీ ప్రణాళికతో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట ఎంఈవో అశోక్ వర్మ, ఉపాధ్యాయులు, సీఆర్పీ సుధాకర్, తదితరులు ఉన్నారు.

క్రైస్తవులు సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్



మాట్లాడుఖితున్న రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్

నిర్మల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన క్రైస్తవ మైనారిటీలు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కమిషన్ చైర్మన్ దీపక్ జాన్ పిలుపునిచ్చారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో క్రైస్తవ మైనారిటీల సమస్యలపై జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సమక్షంలో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని క్రైస్తవులు అభివృద్ధి సాధించాలన్నారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల్లో చర్చి నిర్మాణాల కోసం స్థలాల కేటాయింపు, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం, క్రైస్తవులు కుల, వివాహ ధ్రువీకరణ పత్రాల మంజూరు, సమాధుల కోసం స్థలాల కేటాయింపు తదితర అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్రైస్తవ మైనారిటీల సమస్యల పరిష్కారానికి తగిన సిఫారసులు ప్రభుత్వానికి పంపుతామని హామీ ఇచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ క్రైస్తవ మైనారిటీల సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. అర్హులైన క్రైస్తవులకు ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందేలా సంబంధిత శాఖ అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. చర్చి, కమ్యూనిటీ హాల్ నిర్మాణ అనుమతుల విషయంలో అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ వెల్లడించారు. అంతకుముందు క్రైస్తవ సంఘాల ప్రతినిధులు, పాస్టర్లు తమ సమస్యలను కమిషన్ చైర్మన్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్, చైర్మన్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి మోహన్‌సింగ్, అసోసియేట్ పాస్టర్లు, జిల్లా స్థాయి క్రైస్తవ సంఘాల ప్రతినిధులున్నారు.

విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన



ఓటు వేస్తున్న విద్యార్థిని

భైంసా రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం ఓటుహక్కుపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు విలువను విద్యార్థులకు ఓటు వేయించి వారికి ఎన్నుకునే విధానాలను వివరించారు. పాఠశాలలో ఎన్నికలు నిర్వహించి, మెజార్టీ ఓట్లు వచ్చిన వాళ్లను అధ్యక్షుడు, ఉపాధ్యక్షులుగా సోనీ, సనీత్ రెడ్డిలను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరిత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టీయూటీఎస్ ముథోల్ మండల కార్యవర్గం ఎన్నిక

ముథోల్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): ముథోల్‌లోని స్థానిక ఉన్నత ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఎస్‌టీయూటీఎస్ ముథోల్ మండల సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు భూమన్న తెలిపారు. అధ్యక్షుడిగా సీహెచ్. రాజశేఖరాచారి, ప్రధానకార్యదర్శిగా ఎస్.గణపతి, ఆర్థిక కార్యదర్శిగా భూమన్న, జిల్లా కౌన్సిలర్లుగా టక్కన్ రమేష్, పి.గంగాధర్, జాదవ్ వసంత్‌రావు, ఎన్. రాజేశ్వర్, సహఅధ్యక్షుడిగా ఎస్.నారాయణ, ఉపాధ్యక్షులుగా రత్నాకర్ రావు, కార్యదర్శులుగా రతన్‌సేన్, అతీఫ్ హైమద్, మహిళా ఉపాధ్యక్షురాలిగా భోజబాయి, మహిళా కార్యదర్శిగా వి.వీణ, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా టి.గంగాధర్, బి.వెంకటేశ్వర్ రావులు వ్యవహరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన్న యాదవ్, ప్రధాన కార్యదర్శి జే. లక్ష్మణ్‌లు హాజరయ్యారు.

బాధిత కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందజేత

కుభీర్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): కుభీర్ మండల కేంద్రానికి చెందిన కుభీర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగిలి సాయన్న ఇటీవల మృతిచెందగా ఆయన కుటుంబానికి పీఆర్‌టీయూ ప్రతినిధులు శుక్రవారం రూ.లక్ష చెక్కు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షులు నరేంద్రబాబు, తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కుభీర్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్సి ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పురంశెట్టి సాయి కుమార్‌కు 2025 ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు లభించింది. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దొంతుల సురేష్, జిల్లా సైన్స్ అధికారి వినోద్‌కుమార్, ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, ఎర్రన్న, ఎల్లన్న, లింగమూర్తి, మధుసూధన్, సంజీవ్, దత్తాత్రి, సీఆర్పీ బాలేరావు గంగాధర్, విద్యార్థులు, పాల్గొన్నారు.

గౌడల అరెస్టులను ఖండిస్తున్నాం: టీజీఎస్ జేఏసీ

నిర్మల్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రవ్యాప్తంగా గౌడ కులస్తులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని టీజీఎస్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని దివ్యనగర్‌లోని నివాసంలో అమరవేణి నర్సాగౌడ్ తెలంగాణ గౌడసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్, మోకుదెబ్బ జాతీయ అధ్యక్షుడు, నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్ గ్రామంలో వీడీసీ గూండాల దాడిని ఖండిస్తూ నిరసన తెలిపేందుకు అక్కడికి వెళ్లకుండా అడ్డుకోవడంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గౌడకులస్తులను అరెస్టు చేశారన్నారు. నిర్మల్‌లో అమరవేణి నర్సాగౌడ్, పొన్నం నారాయణ గౌడ్‌లను అరెస్ట్ చూసి నిర్మల్ టౌన్‌కు తరలించారని, అలాగే జిల్లావ్యాప్తంగా వందలాది మంది మోకుదెబ్బ నాయకులను, కార్యకర్తలను, గౌడ కులస్తులను అక్రమంగా అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌లలో నిర్బంధించారని ఆరోపించారు. దాడులు చేసి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్న వీడీసీ, వారి వెనుక ఉన్న వారిపై నాన్ బేలబుల్ క్రిమినల్ కేసులను పెట్టి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాళ్లరాంపూర్ వీడీసీలపై చర్యలు తీసుకునే వరకు రాష్ట్రవ్యాప్తంగా అన్నివర్గాల ప్రజలను కలుపుకొని ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.


డీఎల్‌పీవో లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న ప్రత్యేక అధికారి, ఎంపీడీవో

అంకితభావంతో పని చేస్తేనే గుర్తింపు

నేరడిగొండ, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): అంకిత భావంతో పని చేసిన ఉద్యోగులకు సమాజంలో తగిన గుర్తింపు, ఆదరణ ఎల్లప్పుడు ఉంటాయని నేరడిగొండ మండల ప్రత్యేక అధికారి రవీందర్ పేర్కొన్నారు. మండలంలో ఎంపీవోగా విధులు నిర్వహించిన లక్ష్మణ్ పదోన్నతిపై నిర్మల్ జిల్లా భైంసా డివిజన్ డీఎల్‌పీవోగా వెళ్లడంతో శుక్రవారం ఆయనను సన్మానించారు. ఎంపీడీవో శేఖర్, ఏపీవో వసంత్‌రావు, ఏఈఈలు దినేష్‌కుమార్, సతీష్‌కుమార్, గణేష్, సూపరింటెండెంట్ శ్యామ్‌సుందర్‌రెడ్డి, తదితరులున్నారు.

స్వస్థ నారి సాసాక్ పరివార్ ఆరోగ్య శిబిరం

ఉట్నూర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్యామ్‌పూర్ ప్రాథమిక ఆర్యోగ కేంద్రములో శుక్రవారం స్వస్థనారి సాసాక్ పరివార్ ఉచిత ఆర్యోగ శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రి జనరల్ ఫిజీషియన్ డాక్టర్ గజానన్ ఆధ్వర్యంలో గర్భిణులకు ఆర్యోగ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ముడుగు కృపాశామ్యూల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జిగా రాంప్రసాద్

ఉట్నూర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఇన్‌చార్జి మండల అధ్యక్షుడిగా హస్నాపూర్ గ్రామానికి చెందిన దాసరి రాంప్రసాద్‌ను నియమించినట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ శుక్రవారం తెలిపారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆదేశాలతో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి సందేకార్తిక్ మాదిగ సూచన మేరకు జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ ప్రకటిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రతీఒక్క విద్యార్థి ఉన్నతంగా ఎదగాలని జిల్లా పొగాకు నియంత్రణ విభాగం క్లినికల్ సైకాలజిస్ట్ శ్రీకాంత్ అన్నారు. పొగాకు రహిత విద్యా సంస్థల ఏర్పాటులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ పట్టణ ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. దీనిలో భాగంగా 14416 నెంబర్‌కు ఫోన్ చేసి ఉచిత కౌన్సిలింగ్ సహాయం పొందవచ్చని తెలిపారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నవమాసాలు మోసిన పెంచిన కన్నబిడ్డలు తనను పట్టించుకోకపోవడంతో ఓ వృద్ధురాలు ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా గమనించిన పోలీసులు ఆమెను కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆదిలాబాద్ పట్టణం మహాలక్ష్మివాడకు చెందిన కొమ్మవార్ లక్ష్మీ(80)కి ఇద్దరు కుమారులు ఉన్నారు. కొడుకులు పోషించకపోవడంతో కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో ఆమె రెండేళ్ల పాటు కాలం వెళ్లదీశారు. ఇటీవల అనారోగ్యం బారిన పడడంతో కుమారుల వద్దకు వెళ్లగా పట్టనట్లు వ్యవహరించంతో కలత చెందిన లక్ష్మి పెన్‌గంగ నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించారు. గమనించిన పోలీసులు వృద్ధురాలిని కాపాడి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు జైనథ్ ఎస్సై గౌతమ్ తెలిపారు.

కళాశాలలో స్వచ్ఛతా హీ సేవ

నేరడిగొండ, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛ తాహీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన కళాశాల ఎంపీడీఓ కార్యాలయ అవరణలో ఎంపీడీఓ శేఖర్ ఆధ్వర్యంలో పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ సిబ్బందితో కలిసి స్వచ్ఛతా హీ సేవ కార్య క్రమంలో ఆయన పాల్గొన్నారు.

పోష్ చట్టంపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న మర్సుకోల సరస్వతి


హాజరైన బీఎడ్ చాత్రోపాధ్యాయులు

● యాక్షన్ ప్రోగ్రాం అధ్యక్షురాలు మర్సు కోలా సరస్వతి

ఉట్నూర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు తెచ్చిన పోష్ చట్టంపై మహిళలు ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని యాక్షన్ ప్రోగ్రాం అధ్యక్షురాలు మర్సు కోలా సరస్వతి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కొమరం భీం ప్రాంగణంలో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ బి.ఎడ్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సమావేశానికి యాక్షన్ ఎయిడ్ ప్రోగ్రాం అధ్యక్షురాలు మర్సుకొల సరస్వతి అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ ఉద్యోగ స్థలాల్లో మహిళల భద్రత కోసం పోష్ చట్టం తీసుకొచ్చిన ప్రాముఖ్యతను వివరించారు ప్రతి విద్యాసంస్థ కార్యలయంలో ఐసీసీ ఏర్పాటు తప్పనిసరి అని లైంగిక వేదింపులపై మహిళలు భయపడకుండా ఫిర్యాదు చేయాలని ప్రోత్సహించారు. ఈ సదస్సులో బిఎడ్ కళాశాల ప్రిన్సిపల్ మెస్రం మనోహర్, వైస్ ప్రిన్సిపల్ రాథోడ్ మాణిక్ రావు, సీడీపీఓ ఉమాదేవి అధ్యాపకులు జగన్, విద్యార్థునీలు తిరుమల, ఉమారాణి, సావిత్రి, పూజ, మర్సు కోలా తిరుపతి తదితరులు పాల్గొన్నారు.నిర్వాహకులు మాట్లాడుతూ-విద్యార్థుల్లో, ఉద్యోగుల్లో పోష్ చట్టంపై అవగాహన పెంపొందించడమే ఈ సమావేశ లక్ష్యమని తెలిపారు.

నిరుపేదలకు అండగా సంక్షేమ కార్యక్రమాలు : కంది

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పేద బలహీన వర్గాల సం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వచ్చిన చెక్కులను ఆయన తన క్యాంపు యాల్లోయంలో లబ్ధిదారులకు అందించారు. రూ.14 లక్షల విలువ గల 27 చెక్కులను లబ్ధిదారులకు అందించారు. సీఎంఆర్‌ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశామని, ఆస్పత్రుల్లో డబ్బులు పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకో


వినతులను పరిశీలిస్తున్న కంది శ్రీనవాసరెడ్డి

వచ్చని కంది తెలిపారు. అదేవిధంగా ఇటీవల జిల్లా గొర్ల పెంపకం దారుల సహకార సంఘ ఎన్నికలలో విజయం సాధించిన అధ్యక్షుడు గవ్వల సాయి చైతన్య, ఉపాధ్యక్షుడు కెంద రాకేష్‌తో పాటు కార్య వర్గ సభ్యులు కందిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని శాలువాలతో ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. అంతకుముందు ప్రజా సేవ భవన్‌లో నిర్వహించిన ప్రజా దర్బార్‌కు నియోజకవర్గంలోని నలుమూలల నుంచి ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ప్రజలు తమ సమస్యలను కంది శ్రీనివాస రెడ్డికి వివరించి వినతి పత్రాలు అందించారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు గిమ్మ సంతోష్, మునిగెల నర్సింగ్, సామ రూపేష్ రెడ్డి, నాగర్కర్ శంకర్, అల్చెట్టి నాగన్న, ఫైజుల్లా ఖాన్, గుడిపట్టి నగేష్, కొండ గంగాధర్, బండారి సతీష్ పాల్గొన్నారు.

'రాష్ట్రంలో ప్రజా పాలన నడుస్తోంది'

తలమడుగు, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బానిస పాలనా పోయి ప్రజా పాలన నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని సాయిలింగి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం సాయిలింగి గ్రామంలోని దత్తాత్రేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత మాజీ సర్పంచ్ దేవర పోచ్చన్న మాతృమూర్తి ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాలల పరిరక్షణకు పాటుపడాలి

సిరికొండ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): బాలల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని, వారి హక్కులను కాపాడేందుకు ప్రతి పౌరుడు సామాజిక బాధ్యతగా తీసుకోవాల్సిన అవసరం ఉందని మండల ప్రత్యేక అధికారి ఫణీంధర్ అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అంగన్‌వాడీ టీచర్లకు 'బాలల పరిరక్షణ' పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తహసీల్దార్ తుకారాం, ఎంపీడీవో రవీందర్, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ మాట్లాడారు.

ఆదివాసీ భవిష్యత్ ఉద్యమ కార్యాచరణపై సమావేశం

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీ, రాజ్ గొండ్ సేవ సమితి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు నివా సంలో శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రాజ్ గోండ్ సేవా సమితి సభ్యులు, ఆయా మండలాల రాయి సెంటర్ సర్మెడీలు, పటేళ్లు, దేవరీ, మహాజన్‌లతో సమావేశం నిర్వహించారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాల్సిన విధి విధానాలపై చర్చించారు. ఈ విషయంలో కేసు కోర్టులో ఉందని ప్రతి ఒక్కరు చట్టాలను గౌరవించాలని సోయం బాపురావు సూచించారు. రాబోయే రోజుల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా శాంతియుతంగా ర్యాలీలు, సభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్క ఆదివాసీ తమ విధిగా ప్రతి నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో గొండ్వాన గోండ్ మహాసభ జాతీయ ఉపాధ్యక్షులు సిడాం అర్జు, రాష్ట్ర ఉపాధ్యక్షడు సేద్మకి ఆనంద్ రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విషం రావు, జిల్లా అధ్యక్షులు పంద్రం శంకర్, జిల్లా మేడి కుర్సంగ్ మోతిరం, తదితరులు పాల్గొన్నారు.

ఊరెళ్లే.. దారేదీ?

(5వ పేజీ తరువాయి...)

ఇంజనీరింగ్ శాఖలు అప్రమత్తమైనట్లు కనిపించడం లేదు. ప్రధానంగా నిధుల కొరతతో మరమ్మతులు చేపట్టేందుకు అవకాశమే లేకుండా పోతుందని అధికారులు చెబుతున్నారు. రోడ్ల నిర్మాణం పూర్తయిన తర్వాత చిన్నపాటి జాగ్రత్తలు కూడా తీసుకోవడం లేదు. రోడ్లకు ఇరువైపుల ముళ్లపొదలు, పిచ్చిమొక్క లు పెరిగి ప్రమాదకరంగా మారుతున్నాయి. అలాగే రోడ్లపై వర్షపు నీరు నిల్వడంతో భారీ గుంతలు ఏర్పడుతున్నాయి. వర్షపు నీటిగుంతలను తప్పించే క్రమంలో రెప్పపాటులో ప్రమాదాలు జరిగిపోతున్నాయి. ఇప్పటికి ఎన్నో గ్రామాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు మార్గాలు లేకపోవడంతో కాలీ నడకనే కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తుంది.

అత్యవసరంలో దేవుడే దిక్కు

చాలా మారుమూల గ్రామాలకు రవాణా సౌకర్యం లేకపోవడంతో అత్యవసర సమయంలో దేవుడేదిక్కంటూ భారం వేసి కాలం గడుపుతున్నారు. ముఖ్యంగా వర్షాకాల సీజన్‌లో గర్భిణులను ఆస్పత్రికి తరలించాలంటే కుటుంబ సభ్యులు పడరాని పాట్లు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో సమయానికి వైద్యం అందక ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితులను అదిగమించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ జిల్లావ్యాప్తంగా 10 బర్త్ వెయిటింగ్ రూమ్‌లను ఏర్పాటు చేసి గర్భిణులను ముందస్తుగానే తరలిస్తున్నారు. దీంతో కొంత వరకు ప్రమాదాలు తగ్గుముఖం పడుతున్నాయి. వానాకాలం సీజన్‌లో విజృంభిస్తున్న వైరల్, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, డయేరియా వ్యాధులను అరికట్టేందుకు వైద్యసిబ్బంది తీవ్ర ఇబ్బందులతో మారుమూల గ్రామాలకు వెళ్లా.. వైద్య సేవలను అందిస్తున్నారు. ఇప్పటికీ పల్లె వెలుగు బస్సు అంటే ఎరుగని గ్రామాలు ఉన్నాయం టే అతిశయోక్తి కాదు మరి.


గాదిగూడలో నిరసన తెలుపుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

బయటపడ్డ నకిలీ, గడువు ముగిసిన నిత్యావసర సరుకులు

నార్నూర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గాదిగుడ మండల కేంద్రంలో భారీగా నకిలీ, గడువు ముగిసిన నిత్యావసర సరుకులను ఆదివాసీ సంఘాలు తుడుందెబ్బ, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం గుట్టురట్టు చేశారు. ఈ వ్యవహారంపై మండలకేంద్రంలోని అంగడి బజార్‌లో వ్యాపారస్తులు ఇలా గడువు ముగిసిన, నిత్యావసర సరుకుల అమ్మకాలు చేసే సమయంలో కొన్ని దుకాణాలు మీద అనుమానం రావడంతో సంఘాల నాయకులు తనఖీ చేశారు. దీంతో వాస్తవాలు బయట పడడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం నకిలీ, గడువు ముగిసిన సరుకులతో స్థానిక కొమురం భీం విగ్రహం దగ్గర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందుర్ సంతోష్, తుడుందెబ్బ మండల అధ్యక్షులు మడావి చంద్రహరి మాట్లాడుతూ వెనుకబడిన ఆదివాసీ గిరిజన ప్రాంతాలలో స్థానికు ప్రాణాలతో వ్యాపారస్తులు చెలగాటం ఆడుతున్నారని మండిపడ్డారు. దీనిలో వెనక పెద్ద కుట్ర జరగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లోపం కూడా ఎక్కువగానే ఉందని, దర్జాగా వ్యాపారులు కాలం చెల్లిన నితావ్యసర సరుకులను అమ్మతున్నా.. ఎందుకు పట్టించు కోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఈ విషయమై కలెక్టర్ స్పందించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం కొరింగే శంభు, మడావి యశ్వంత్ రావు,మెస్రం వామన్, మరప గంగారాం, మెస్రం సంతోష్, కొడప లింగు పాల్గొన్నారు.


భీమ్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న అయిండ్ల స్వర్ణారెడ్డి


వర్ధంతిలో పాల్గొన్న ప్రజలు

మాజీ డిప్యూటీ స్పీకర్ భీమ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

లక్ష్మణచాంద, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డిప్యూటీ స్పీకర్ అయిండ్ల భీమ్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని పలువురు నాయకులు కొనియాడారు. మండలంలోని మునిపెల్లి, మల్లాపూర్ గ్రామాల్లో శుక్రవారం 32వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. న్యాయవాద వృత్తికే వన్నె తెచ్చి ప్రజాసమస్యల పరిష్కారం విషయంలో ధైర్యంగా ముందుకు నడిచి నిర్మల్ టైగర్‌గా పేరు తెచ్చుకున్నారని అన్నారు. నిర్మల్ ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పౌర సరఫరాల శాఖ మంత్రిగా, అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా సేవలందించారని అన్నారు. మునిపెల్లిలో అన్నదాన నిర్వహించటంతో పాటు మునిపెల్లి-మల్లాపూర్ గ్రామాల్లో గల ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయన కుమార్తె ప్రముఖ స్త్రీవైద్య నిపుణురాలు అయిండ్ల స్వర్ణారెడ్డి, మాజీ సర్పంచ్ కమల్‌కోట లక్ష్మీ వెంకట్ రెడ్డి, అడిచెర్ల రవి కుమార్, కేశం శ్రీనివాస్, మేడిపెల్లి గంగాధర్, మాజీ ఎంపీటీసీలు అడిచెర్ల శంకర్, బిట్లింగ్ నారాయణ, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గురాల లింగారెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చిన్న రాజారెడ్డి, మాజీ పీఏసీఎస్ వైస్ చైర్మన్ కొండాపూర్ నర్సారెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు రాంపెల్లి రమేష్, చిదుగు భీమ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గీతా కార్మికుల ముందస్తు అరెస్ట్

లక్ష్మణచాంద, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు గీతా కార్మికులను శుక్రవారం ముందస్తు అరెస్ట్ చేశారు. నిజామాబాద్ జిల్లా తాళ్లరాంపూర్ గ్రామకమిటీ ఆగడాలను నిరోధించటానికి 'తాళ్లరాంపూర్ గ్రామ ముట్టడి' కార్యక్రమానికి రాష్ట్రకమిటీ పిలుపునిచ్చిన నేపథ్యంలో వీరిని ముందస్తు అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అరెస్టయిన వారిలో దశగౌడ్, గంగాదర్ గౌడ్, లింబాగౌడ్, శ్రీకాంత్ గౌడ్, ఈశ్వర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌లో తైక్వాండో ప్రమోషన్ బెల్ట్ టెస్ట్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : టైక్వాండో ప్రమోషన్ బెల్ట్ టెస్ట్‌ను పట్టణంలో అంబేద్కర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించినట్లు తైక్వాండో అసోసియేషన్ జనరల్ సెక్రటరీ అక్షయ్ దయాత్ తెలిపారు. ఈ బెల్ట్ టెస్టుల్లో శ్రీ చైతన్య స్కూల్, భాష్యం హైస్కూల్ నుంచి దాదాపు 60 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. మాజీ మున్సిపల్ చైర్మన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థుల జీవితాల్లో తైక్వాండో క్రీడల ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. కార్యక్రమాన్ని మాస్టర్ నాగరాజు, జిల్లా అధ్యక్షుడు దయాత్ సోమేశ్వర్, కోచ్‌లు వెంకట్, శ్రీనివాస్, తిరుపతి, సూర్యలు పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతిక సేవలను వినియోగించుకోవాలి

భైంసా, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా మార్కెటింగ్ రంగంలో అందుబాటులోకి వస్తున్న అధునిక సాంకేతిక సేవలను సద్వినియోగపరుచుకోవాలని భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్ సూచించారు. శుక్రవారం భైంసా పట్టణ పరిధిలోని ప్రజలకు ఆన్‌లైన్ హోమ్ డెలివరి సేవలను అందించేందుకు గాను అవ్వమ్ ట్రావెల్స్ సంస్థ రూపొందించిన యాప్‌ను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడారు.

అటవీ, గిరిజన ప్రాంతాల పరిధిలో

అభివృద్ధి పనులను చేపట్టాలి

» కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అటవీ, గిరిజన ప్రాంతాల పరిధిలో అభివృద్ధి పనులను చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అటవీ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన అంశాలపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్, రహదారులు, భవనాల శాఖల ద్వారా మంజూరైన పనులపై సమగ్ర సమీక్ష జరిపారు. ఇప్పటికే చేపట్టిన పనుల పురోగతిని, అటవీ, రెవెన్యూ శాఖల అనుమతుల మంజూరు స్థితిని వివరంగా అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో ప్రాజెక్టులు అమలు చేయడంలో ఎదురవుతున్న సమస్యలను అధి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

గమించేందుకు సమన్వయం అవసరమని సూచించారు. ముఖ్యంగా ఖానాపూర్, దస్తురాబాద్, కడెం, సారంగాపూర్ మండలాల్లోని ఆయా ప్రాంతాలలో రెవెన్యూ, అటవీ శాఖలు కలిసి జాయింట్ సర్వేచేపట్టి, అటవీ హద్దులు, భూవివాదాలు లేకుండా పనులను పూర్తి చేయాలని సూచించారు. స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్‌సర్వే, అభివృద్ధి పనుల పర్యవేక్షణ వంటి అంశాలపై చర్చించారు. అటవీ, గిరిజన ప్రాంతాల్లో ప్రాథమిక సౌకర్యాల కల్పనపై అధికారులు వేగంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కు మార్, డీఎఫ్‌వో నాగిని భాను, భైంసా సబ్ కలెక్టర్ సాంకేత్ కుమార్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, అటవీ, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

సోన్ పీహెచ్‌సీలో వైద్య శిబిరం

సోన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రిలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డా.జయప్రకాష్ ఈఎన్‌టీ స్పెషలిస్ట్ శుక్రవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చెవి, ముక్కు, గొంతు వంటి పరీక్షలు చేశారు. మహిళలు, పిల్లలకు మెరుగైన వైద్య సేవలందించడానికి ఈ శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యాధికారి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

'కమలాకర్‌రావు సేవలు అభినందనీయం'

సోన్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిగా సుమారు 40 ఏళ్ల పాటు క్రమశిక్షణతో, అంకితభావంతో, అకుంఠిత దీక్షతో పనిచేసి వందలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన గొప్ప గురువు అనుముల కమలాకర్‌రావు కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి మాజీ సభ్యుడు, ఉమ్మడి నిర్మల్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, సోన్ మండల ఎంఈవో పరమేశ్వర్ కొనియాడారు. శుక్రవారం సోన్ మండలం కడ్తాల్ ఉన్నత పాఠశాలలో ఐదేళ్లపాటు పనిచేసి, పదవీ విరమణ పొందిన సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, శాంతినికేతన్ పాఠశాల డైరెక్టర్ పద్మనాభ గౌడ్, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, సంఘ నాయకులు, తదితరులున్నారు.

హెడ్‌కానిస్టేబుల్‌పై కత్తితో దాడిచేసిన నిందితుడి అరెస్టు

» భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్

భైంసా, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): సబ్‌డివిజన్ పరిధిలోని కుభీర్ పోలీసుస్టేషన్‌లో విధి నిర్వహణలోనున్న హెడ్‌కానిస్టేబుల్ నారాయణపై కత్తితో దాడికి పాల్పడిన నిందితుడుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. శుక్రవారం భైంసా ఎస్‌డీపీవో కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ పట్టణానికి చెందిన అబ్దుల్ కలీమ్ కొంత కాలంగా కుభీర్‌లోని తన అత్తమ్మ ఇంట్లో భార్య పిల్లలతో కలిసి నివాసముంటున్నాడు. గురువారంరాత్రి తాగిన మైకంలో నిందితుడు తన భార్యతో గొడవ పడ్డాడు. దీంతో అతనిభార్య పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసికేసు పెడతానని భయపెట్టింది. అప్పటికే తాగినమైకంలో అసహనంతో వ్యవహరిస్తున్న నిందితుడు తానే పోలీసు స్టేషన్‌కు వెళ్లి వారి సంగతి చూస్తానంటూ ఇంటి నుంచి నేరుగా 9.45 ప్రాంతంలో పోలీసు స్టేషన్‌కు వెళ్లాడు.


వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ

అక్కడ విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ నారాయణ అనుమానాస్పదంగా వ్యవహరిస్తూ పోలీసుస్టేషన్‌లోనికి వచ్చేందుకు యత్నిస్తున్న అబ్దుల్‌కలీమ్‌ను నిలువరించారు. దీంతోనిందితుడు అరుస్తూ తనవెంట తెచ్చుకున్న కత్తితీసి లోనికి వెళ్లనీయకుండా నిలువరిస్తున్న హెడ్ కానిస్టేబుల్ నారాయణపై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో గాయపడ్డ హెడ్ కానిస్టేబుల్ కేకలు వేయడంతో పోలీసు స్టేషన్ లోపలి గదిలోనున్న హోమ్ గార్డు గిరి పరుగున వచ్చి నిందితుడిని అడ్డుకునేందుకు యత్నించగా ఆయనపై సైతం దాడికి యత్నించి అక్కడి నుంచి పారిపోయాడు. సంబంధిత సమాచారం అందుకున్న ఇతర పోలీసు సిబ్బంది హుటహూటిన పోలీసు స్టేషన్‌కు తరలివచ్చి గాయపడిన హెడ్ కానిస్టేబులు, హోంగార్డులను భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అక్కడకు చేరుకున్న కుభీర్ ఎస్ఐ కృష్ణారెడ్డి, సీఐ నైలు ఘటన వివరాలను పరిశీలించి పారిపోయిన నిందితుడిని పట్టుకునేందుకు గాలింపు చర్యలు చేపట్టారు. విశ్వసనీయ సమాచారం మేరకు కుభీర్ శివారులోని పంటచేనులో నిందితుడు ఉన్నట్లుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. దాడికి వినియోగించిన కత్తిని స్వాధీన పరుచుకున్నారు. నిందితుడు ధర్మాబాద్‌లో జరిగిన హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడని వివరించారు. పోలీసు సిబ్బందిపై దాడికి పాల్పడిన నిందితుడికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.విలేకరుల సమావేశంలో భైంసా టౌన్, రూరల్ సీఐలు గోపినాథ్, నైలు, ముథోల్ సీఐ మల్లేష్, కుభీర్ ఎస్ఐ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

యోగా పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చాలి

» ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్

భైంసా, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధి నుంచి జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు పోటీల్లో రాణించి భైంసా డివిజన్‌కు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఎమ్మెల్యే రామారావ్ పాటిల్ ఆకాంక్షించారు. ఇటీవల జిల్లాకేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో బాసరలోని నాగభూషణం విద్యాలయంకు చెందిన అవినాష్, మనీష్‌లు జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. శుక్రవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన ఇద్దరు విద్యార్థులను అభినందించి ఘనంగా సత్కరించారు. ఇదేక్రమంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన చరణ్, సాయి, అవంతి, బి. పార్థు, జీ. కేశవ్, జిల్లా స్థాయిలో ప్రథమస్థానంలో నిలిచిన దేగాం గ్రామానికి చెందిన స్రవంతి రెడ్డిలను సైతం ఎమ్మెల్యే అభినందించి జ్ఞాపికలను బహూకరించారు. ఇందులో బీజేపీ భైంసా మండల అధ్యక్షురాలు సిరం సుష్మారెడ్డి, పార్టీ ప్రతినిధులు చిన్నారెడ్డి, సౌంలీ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని వినియోగించుకోవాలి

వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని మహిళా రైతులు సద్వినియోగపరుచుకోవాలని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ సూచించారు. శుక్రవారం భైంసాలోని క్యాంప్ కార్యాలయంలో డివిజన్ పరిదిలోని వ్యవసాయాధికారులతో కలిసి యాంత్రీకరణ పథకానికి సంబంధించిన వివరాలు తెలిపే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా రైతులకు చేయూతనిచ్చేందుకు గాను సబ్సీడిపై యంత్ర పరికరాలు అందచేయనున్నాయని వివరించారు. ఇందులో భైంసా ఏడీఏ వీణ , భైంసా, కుంటాల, కుభీర్ మండలాల వ్యవసాయాధికారులు గణేష్, విక్రమ్, సారిక, వ్యవసాయ విస్తీర్ణాధికారి ఆకాష్ పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలి

కుభీర్, సెప్టెంబరు19 (ఆంధ్రజ్యోతి): శ్రీవిఠలేశ్వరస్వామి ఆలయంలోకి చొరబడి భక్తిసంకీర్తనలు చేస్తున్న భక్తులకు బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీవిఠలేశ్వరస్వామి ఆలయంలో గ్రామస్థులు యువజన సంఘాల నాయకులు సమావేశమై పలు అంశాలపై చర్చించారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏఎస్ఐ రాంచందర్‌కు అందజేశారు. 17న రాత్రి ఆలయంలో భజనలు, హరినామ సంకీర్తనలు చేస్తుండగా ఓ వర్గానికి చెందిన యువకుడు ఆలయంలోకి వచ్చి భజనలు నిలిపివేయాలని బెదిరించాడు. మరో ఐదుగురు వ్యక్తులను పిలిచి దాడికి పాల్పడేలా ప్రయత్నించాడని పేర్కొన్నారు. ఆ వ్యక్తులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బోయిడి అభిషేక్, ఏశాల దత్తాత్రి, యదవ, మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు ఉప్పు దత్తాత్రి, చిమ్మన్ అరవింద్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు సూది రాజన్న, గ్రామస్తులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

'అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి'

లక్ష్మణచాంద, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మామడ మండల కేంద్రంలో ఈనెల 22న నిర్వహించే బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మామడ మాల, బహుజన కమిటీ శుక్రవారం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ మండలంలోని లక్ష్మణచాంద, మల్లాపూర్, చామన్‌పెల్లి, చింతల్‌చందా, పార్‌పెల్లి, ధర్మారం, తిరుపెల్లి, పొట్టపెల్లి, వడ్యాల్, కనకాపూర్, పీచర, బాబాపూర్, నర్సాపూర్, బోరిగాం తదితర గ్రామాలలో ప్రచారం చేశారు. అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి విగ్రహ ఆవిష్కరణ చేయనుండగా, ప్రత్యేక ఆహ్వానితులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, విశిష్ట అతిథులుగా ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్, వెడ్మ బొజ్జు, ఎంపీ గెడం నగేష్, గౌరవ అతిథులుగా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలలు హాజరుకానున్నారని తెలిపారు. ఆయా గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో నాయకులు చిలుక సుధాకర్, దేవోళ్ల మధుకర్, కప్పకంటి సురేష్, అలుగునూరి నరేందర్, సుదర్శన్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ సంతకాలపై విచారణ వేగవంతం

- ఏఈవోను విచారించిన పోలీసులు


నర్సాపూర్(జి), సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొంతకాలంగా వెలుగులోకి వస్తున్న ఫోర్జరీ, మోసాల కేసులపై పోలీసులు విచారణను ముమ్మరం చేశారు. ఇటీవల చోటుచేసుకున్న రెండు వేర్వేరు కుం భకోణాల్లో ఫోర్జరీ సంతకాలు కీలక పాత్ర పోషించాయి. ఈ వ్యవహారంలో ప లువురు ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకుల ప్రమేయం ఉన్నట్లు స మాచారం. శుక్రవారం పోలీసులు ఒక ఏఈవోను విచారించడంతో ఈ కేసు ల్లో అస లు విషయాలు బయటపడతాయని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

రైతు బీమా మోసం...

రైతు బీమా పథకం కింద జరిగిన భారీ మోసం కేసులో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. 2108లోనే విదేశాల్లో మరణించిన ఒక వ్యక్తి పేరున 2020లో నకిలీ మరణ ధ్రువీకరణ పత్రాన్ని సృష్టించి, ఆ నిధులను కాజేసిన ట్లు ఆరోపణలు వెలువడ్డాయి. ఒక సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద వ్యవసాయ కార్యాలయం నుంచి పొందిన వివరాలతో ఈ కుంభకోణం బయటపడింది. ఏఈవో కాల్వ రమ్య ఇచ్చిన ఫిర్యాదుతో ఈ కేసు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. తాను ప్రసూతి సెలవుల్లో ఉన్న సమయంలోనే రైతు బీమా క్లెయిమ్‌లు జరిగినట్లు ఆమె పోలీసులకు వివరించారు. ఈ వ్యవహారంలో ఆమె సంతకాలను ఫోర్జరీ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

నకిలీ ఇంటి పత్రాల కుంభకోణం..
పంచాయతీ అధికారుల ప్రమేయం

ఇదే సమయంలో నకిలీ ఇంటి పత్రాల కుంభకోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. ఈ కేసులో 2022 డిసెంబరు 8న మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వీణారెడ్డి నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పంచాయతీ కారోబార్‌గా పని చేస్తున్న కోటగిరి చిన్నయ్యపై ఆమె ఆరోపణలు చేశారు. ఈ రెండు కేసుల్లోను ఫోర్జరీ సంతకాలే ప్రధానాంశంగా ఉండటం గమనార్హం.



గతంలో పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు పత్రం
2020లో ఫోర్జరీ సంతకాల డెత్ సర్టిఫికెట్‌తో మోసం చేసిన సర్టిఫికెట్

విచారణలో కీలక మలుపులు...

ఈ రెండు కుంభ కోణాలు నర్సాపూర్(జి) మండలంలో హాట్ టాపిక్‌గా మారాయి. రైతు బీమా కేసులో ఏఈవో, వ్యవసాయ అధికారి, అలాగే నకిలీ ఇంటి పత్రాల కేసులో పంచాయతీ కార్యదర్శి, కారోబార్‌తో పాటు కొంతమంది రాజకీయ నాయకుల ప్రమేయం ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ విచారణలో మరిన్ని సంచలన విషయాలు బయటపడే అవకాశం ఉందని, త్వరలో నిందితులను అరెస్ట్ చేసే అవకాశం ఉందని పోలీసు వర్గాలు వెల్లడించాయి. శుక్రవారం ఏఈవోను పోలీసులు విచారించడంతో అతని నుంచి మరింత సమాచారం లభించే అవకాశం ఉందని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.


ఉట్నూర్‌లో ఎస్జీఎఫ్ క్రీడలు ప్రారంభిస్తున్న పీవీటీజీ ఏపీవో

ఖోఖోలో జాతీయస్థాయిలో సత్తా చాటడం అభినందనీయం

ఉట్నూర్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన క్రీడాకారులు జాతీయస్థాయి ఖోఖో పోటీల్లో సత్తా చాటడం అభినందనీయమని ఐటీడీఏ ఏపీవో(పివిటిజి) డాక్టర్ మెస్రం మనోహర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కుమ్రం భీం ప్రాంగణంలోని క్రీడా మైదానంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ 17 ఏళ్ల విభాగం బాలుర ఖోఖో పోటీలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యతో పాటు ప్రతీ విద్యార్థి శ్రద్ధ వహించాలని అన్నారు. ఏదో ఒక ఆటను ఎంచుకొని అందులోనే రాణించేందుకు శ్రమించాలని సూచించారు జిల్లా ఎస్జీఎఫ్ నిర్వహణ కార్యదర్శి ఆడే రామేశ్వర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఎస్‌జీఎఫ్ క్రీడా జట్లను పగలబంది గాని నిర్వహిస్తున్నామని అన్నారు.సెల క్షన్ కమిటీ సభ్యులు ప్రతిభావంతులనే ఎంపిక చేయాలన్నారు. రాష్ట్రస్థాయిలో జిల్లాకు గుర్తింపు తెచ్చే విధంగా చూడాలని కోరారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి మాట్లాడుతూ అక్టోబర్లో రాష్ట్రస్థాయి పోటీలునందున పీడీలు వీటిలో క్రీడాకారులను జట్లుగా సన్నద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పేట కార్యదర్శి జె సాయి కుమార్,జాదవ్ హేమంత్ నాయక్, రాథోడ్ ఉత్తమ్, డిప్యూటీ వార్డెన్ గంగారం, రాము, ప్రతాప్, కోచ్ లు శివ కృష్ణ, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సొంత డబ్బులతో రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు

ముథోల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ముథోల్ ఉమ్మడి మండలంలోని ఆష్టా, ఓని, కౌట, గన్నోర, బ్రహ్మంగావ్ వెళ్లే రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అయితే ఆయా గ్రామ వీడీసీ సభ్యులు, గ్రామస్థులు, పలువురు నాయకులు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను కలిసి తాత్కాలికంగా రోడ్డు మరమ్మతులు చేయించాలని కోరారు. సానుకూలంగా స్పందించి ఎమ్మెల్యే త్వరలో పూర్తిస్థాయి రోడ్డు వేయిస్తానని, తక్షణమే తాత్కాలికంగా మరమ్మతులు చేయిస్తానని చెప్పి శుక్రవారం విటోలి తండా నుండి ఆష్టా రహదారిపై ఏర్పడ్డ గుంతల్లో మొరంతో తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా వారు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.


రోడ్డుపై ఏర్పడ్డ గుంతలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

'సాహితీ కిరీటి' జాతీయ పురస్కారానికి డా. తుమ్మల దేవరావు ఎంపిక

ముథోల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ స్థాయి ఐఎస్‌వో గుర్తింపు పొంది, అనేక సాహితీ సభలు నిర్వహించి ప్రపంచ రికార్డులు నెలకొల్పిన శ్రీశ్రీ కళావేదిక ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి 'సాహితీ కిరీటి' పురస్కారానికి నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ కవి, చరిత్ర పరిశోధకుడు డా. తుమ్మల దేవరావు ఎంపికైనట్లు సంస్థ అంతర్జాతీయ అధ్యక్షులు డా. కత్తిమండ ప్రతాప్, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరీ భూషణంలు ఎంపిక పత్రంలో తెలియజేశారు. తుమ్మల దేవరావు గత 30 సంవత్సరాలుగా సాహితీ రంగంలో కవిత్వం, కథ, వ్యాసాలు, హైకూలు, చరిత్ర పరిశోధన రంగాల్లో విస్తృతంగా సేవలందిస్తున్నారు. వీరి రచనలకు రాష్ట్ర, జాతీయ స్థాయి పురస్కారాలు ఎన్నో వరించాయి. ఈ మధ్యనే తెలుగు యూనివర్సిటీ పరిశోధన విభాగంలో కీర్తి పురస్కారానికి ఎంపిక చేశారు. వీరు రచించిన కచ్చురం, మట్టిపాదాలు, గడ్డిపూలు, నిర్మల్ జిల్లా సాహిత్య చరిత్ర, నిర్మల్ కథలు ఎంతో ప్రసిద్ధి చెందడమే గాక సినారే జాతీయ సాహితీ పురస్కారానికి ఎంపికైంది. వీరి రచనలపై వివిధ యూనివర్సిటీలల్లో పరిశోధనకు ఎంచుకున్నారు. సాహితీ కిరీటి పురస్కారం రావడంతో సాహితీ మిత్రులు డా. దామెర రాములు, డా. చక్రధారి, పత్తి శివ ప్రసాద్, నేరెళ్ల హన్మంతు, కామారపు జగదీశ్వర్, అబ్బడి రాజేశ్వర్ రెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు.


డా. తుమ్మల దేవరావు

యూరియా కోసం దండి తిప్పలు

- బేలలో సొసైటీ వద్ద బారులు తీరిన రైతులు
- రైతుపై చేయిచేసుకున్న పోలీసులు
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అన్నదాతలు


రైతుపై చేయిచేసుకుంటున్న బేల పోలీసులు


బేలలో యూరియా కోసం బారులు తీరిన రైతులు

ఆదిలాబాద్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. నెల రోజులుగా సొసైటీల వద్ద బారులు తీరుతూ పడరాని పాట్లు పడుతున్నారు. శుక్రవారం బేల మండల కేంద్రంలోని సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు క్యూలు కట్టారు. దీంతో అధికారులు పోలీసు భద్రత నడుమా యూరియాను పంపిణీ చేశారు. గంటల తరబడి రైతులు క్యూలైన్‌లో వేచిచూసే ఓపిక లేక అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీసులు పరిస్థితిని చక్కబెట్టే క్రమంలో ఓ రైతు పై చేయి చేసుకోవడంతో అక్కడే ఉన్న రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. అవసరం మేరకు యూరియాను ప్రభుత్వం సరఫరా చేయడం లేదంటూ ఆందోళన చేశారు. దీంతో అధికారులతో కొందరు రైతులు వాగ్వాదానికి దిగారు. పరిమితంగా యూరియాను సరఫరా చేయడం ఏమిటని ప్రశ్నించారు. నిత్యం వ్యవసాయ పనులను వదులుకుని యూరియా కోసమే పడిగాపులు పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.

రాత్రిపూట పోలీసుల విస్తృత తనిఖీలు

బోథ్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): నేరాల అదుపునకు బోథ్ పోలీసులు అర్ధరాత్రి పూట వాహనాలను తనిఖీ చేస్తున్నారు. వాహనాలలో వెళ్లే వారి వివరాలు తెలుసుకునేందుకు తంబు ఇంప్రెషన్ చేస్తున్నారు. దీంతో వ్యక్తుల వివరాలు బయటపడుతుండడంతో రాత్రిపూట ఎవరు వచ్చింది ఎటు వెళ్ళింది అనేది తెలుసుకోవడంతో పాటు ఏదైనా సంఘటనలు జరిగితే అందుకు బాధ్యులు ఎవరనే విషయం బయట పడుతుందని ఎస్సై శ్రీ సాయి తెలిపారు.


బోథ్ మండల కేంద్రంలో అర్ధరాత్రి తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలి

సిరికొండ రూరల్ , సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాల ముత్నూర్ ప్రిన్సిపాల్ శ్రీప్రియ అన్నారు. శుక్రవారం కళాశాలలో బతుకమ్మ పండుగను పురస్కరించుకుని ముందస్తుగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి అధ్యాపకులు,ఉపాధ్యాయినిలతో కలిసి బతుకమ్మ ఆడి పాడారు. అనంతరం ప్రిన్సిపాల్ శ్రీప్రియ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఆమె అన్నారు. బతుకమ్మ ఉత్సవాలు, వాటి ప్రాము ఖ్యతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తెలంగాణ సంస్కృతి సంప్ర దాయాలను ప్రతిబింబించే బతుకమ్మ సంబరాల వేడుకల నిర్వహణపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట,పాటలు అందరిని అలరిం చాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీప్రియ, వైస్ ప్రిన్సిపాల్ లు సంగీ త, విజయ లక్ష్మీ, అధ్యాపకులు, ఉపాధ్యాయినిలు భార్గవి, మాధవి, అరు ణ, సమత, రజిత, గౌతమి, నాగలక్ష్మి, ప్రతిభ, ఛాయా, పూజ, కృష్ణవేణి, ఎంకవ్వ, ఎల్లవ్వ, రాధా, చాందిని, ఆరాధన, రత్నమాల, జీఎస్ఎం సం ధ్యా సంధ్యారాణి, జ్యోతి, లలిత, సంజీత, లలిత, విద్యార్థులు పా ల్గొన్నారు.


బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వికాస్ హైస్కూల్‌లో ముందస్తు బతుకమ్మ సంబరాలు

భైంసా, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వికాస్ హైస్కూల్‌లో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘ నంగా నిర్వహించారు. విద్యార్థుల ఆట, పాటలతో ఉదయం వేళ ప్రారంభమైన వేడుకలు సాయంత్రం వరకు కన్నుల పండువగా కొ నసాగాయి. పాఠశాల విద్యార్థినులు సంప్రదాయ వేషధారణలో వే డుకలలో పాల్గొని తరగతుల వారీగా రంగురంగుల పూలతో శోభయమానంగా బతుకమ్మలను తీర్చిదిద్దారు. పాఠశాల ప్రవేశ మా ర్గంలో వాటన్నింటిని తీసుకవచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం బతుకమ్మ పాటలకు అనుగుణంగా కోలాటాలు వేస్తూ, నృ త్యాలు చేస్తూ పాఠశాల ప్రాంగణాన్ని సందడి చేశారు.ముందస్తు బతుకమ్మ వేడుకలు అహూతులను విశేషంగా అలరారించాయి.వేడుకల చివరలో విద్యార్థినీలు బతుకమ్మలతో శోభయాత్రగా వెళ్లి గడ్డెన్నవాగు ప్రాజెక్టులో వాటిని నిమజ్జనం చేశారు. ఇందులో పా ఠశాల డైరెక్టర్ రవీనా, ప్రిన్సిపాల్ రాజన్న తదితరులతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.


బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయినులు, విద్యార్థినులు

దినసరి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రి హామీ

ఉట్నూర్, సెప్టెంబరు 19 ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలు, వసతి గృహాల్లో పనిచేస్తున్న దినసరి ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణక్క తెలిపారు. శుక్రవారం హైదరాబాదులోని మంత్రి కార్యాలయంలో కలిసి గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కారించాలని కోరుతూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కి వినతిపత్రం సమర్పించామన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నుంచి ఆమె ఫోన్లో మాట్లాడుతూ సెక్రటేరియట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి మంత్రి దృష్టికి పలు అంశాలను తీసుకెళ్లామన్నారు. ముఖ్యంగా 10 నెలలుగా బకాయిగా ఉన్న వేతనాలను విడుదల చేయాలని ప్రస్తుతం అమలులో ఉన్న క్యాటరింగ్ విధానాన్ని రద్దు చేసి జీవో 60 ప్రకారం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానంలో వేతనాలు చెల్లించాలని కోరడం జరిగిందన్నారు వేతన సమస్యల పరిష్కారం కోసం కొన్ని రోజులుగా కార్మికులు సమ్మెచేస్తున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా చర్య లు తీసుకోవాలని విజ్ఞప్తి చేశానన్నారు. సానుకూలంగా స్పందించిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి కట్టుబడి ఉందని రెండు రోజుల్లో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు వివరించారు. దినసరి ఉద్యోగులు సమ్మె విరమించేలా చర్చలు జరిపేందుకు తాను కూడా వారితో మాట్లాడుతానని తెలిపారని అన్నారు. వెంటనే ఉట్నూర్ ఐటీడీఏ పీవో కుష్బు గు ప్తా, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రేలకు ఫోన్ చేసి సమ్మె విరమించేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కార్మికులు సమ్మె విరమించి విధుల్లో చేరాలని మంత్రి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.


ఉట్నూర్‌లో భిక్షాటన చేస్తున్న దినసరి ఉద్యోగులు

దినసరి ఉద్యోగుల భిక్షాటన

ఎనిమిది రోజులుగా సమ్మెకు పూనుకున్న దినసరి ఉద్యోగులు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులు శుక్రవారం ఉట్నూరు మండల కేంద్రంలో భిక్షాటన చేస్తూ నిరసన తెలిపారు చాలీచాలని వేతనాలతో జీవిస్తున్న తమకు వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం పది నెలలుగా కాలయాపన చేస్తుందని అందుకే నిరవధిక సమ్మె కు పూనుకోవాల్సి వచ్చిందని సంఘం నాయకులు ఎరుకొండ రాజన్న.బాపు రావులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జు ఆశన్న మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పంచాయతీలలో పనులు చేయలేకపోతున్నాం

బోథ్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ కార్యదర్శులపై ప్రభుత్వం వివిధ రకాల పనులు అప్పగించి తీవ్రమైన ఒత్తిడి గురి చేస్తుందని, అంతేగాక పనులకు అవసరమైన నిధులు లేకపోవడంతో తమపై ఆర్థిక భారం పడుతుందని సోనాల మండల కేంద్రంలోని గ్రామాల కార్యదర్శిలు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. పంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడంతో పాటు వివిధ రకాల పనులు అప్పగిస్తున్నారని దీంతో తాము విధులు సక్రమంగా నిర్వహించలేకపోతున్నామని గ్రామాల కార్యద ర్శులు ఎంపీడీవోకు వివరించారు. అంతేగాక ఇటీవల ఇందిరమ్మ ఇండ్లను సైతం తమకి అప్పగించి పనులు పూర్తయ్యేలా చూడాలని ఒత్తిడి తీసుకు వస్తున్నారని దీంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నమన్నారు. నరసాపూర్ గ్రామానికి చెందిన కార్యదర్శిని అధికారులు సస్పెండ్ చేశారని ఆయనను విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సోనాల మండలంలోని వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.


సోనాలలో ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న గ్రామాల కార్యదర్శులు

ఆరోగ్యం పట్ల మహిళలు జాగ్రత్త వహించాలి

- రిమ్స్ వైద్యురాలు సుజాత

నార్నూర్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాల కారణంగా వ్యాధులు సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని, మహిళలు ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని స్త్రీ నిపుణులు రిమ్స్ వైద్యురాలు సుజాత అన్నారు. స్వస్త్ నారి సశక్తి పరివార్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన క్యాంప్‌లో పాల్గొని 45 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి ముగ్గురుని ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యంపై అక్టోబర్ 2 క్యాంప్‌లు నిర్వహించనట్లు తెలిపారు. పోషణ కిట్లు అందించారు. ఆశ్రమ బాలికల పాఠశాల వద్ద టీబీ ఎక్స్‌రే నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు, రాంబాబు, జితేందర్ రెడ్డి, లక్ష్మి, తులసీదాస్, చవాన్ చరణ్ దాస్ పాల్గొన్నారు.

పుస్తక నిర్మాణం సక్రమంగా నిర్వహించాలి

బోథ్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామ సంఘాల పుస్తక నిర్మాణం సక్రమంగా నిర్వహించాలని సీపీవో ఆడిటర్స్ జి.రాజేందర్, ఎ.గంగాధర్‌లు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘాల పుస్తక నిర్వహణపై ఒకరు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మండలంలోని పలు గ్రామాలతో పాటు సీసీలకు పూర్తిస్థాయి అవగాహన కలిగించారు. రికార్డులను ఎప్పటికప్పుడు నిర్వర్తించాలని ఆడిట్‌లో ఎలాంటి రిమార్కు లేకుండా పుస్తక నిర్వహణ ఉండాలన్నారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి జరిగే అంతర్గత ఆడిట్ తప్పులు లేకుండా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రిలో మరమ్మతులు ప్రారంభం

బోథ్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస వసతులు లేకపోవడంతో వైద్యులు ప్రజలకు వైద్యం అందించలేకపోతున్నారు అయితే మూలనపడ్డ వివిధ రకాల సామాగ్రిని మరమ్మతులు చేయిస్తున్నారు అందులో భాగంగానే నిల్వ ఉన్న సిలిండర్లకు మరమ్మత్తులు చేయిస్తున్నారు ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరిడెంట్ రవి మాట్లాడుతూ అత్యవసర సమయంలో అవసరమైన సామాగ్రిని వినియోగంలోకి తీసుకు వస్తున్నామని గతంలో నిర్లక్ష్యంగా వదిలివేసిన సామాగ్రిని రోగులకు ఉపయోగపడే విధంగా మరమ్మతులు చేస్తూ ఉండడంతో స్థానికులు హర్షం వ్యక్తపరుస్తున్నారు.


బాసర ఆలయంలో పూజలు చేస్తున్న నిర్మాత దిల్‌రాజు

బాసరలో దిల్‌రాజు పూజలు

బాసర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు చిత్ర నిర్మాత దిల్‌రాజు శుక్రవారం బాసర సరస్వతి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదను అందించి ఆలయ పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

బాసర ఆర్జీయూకేటీలో ఐఈఈఈ విద్యార్థి శాఖ ప్రారంభం


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, అధ్యాపకులు

బాసర, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్ (ఆర్జీయూకేటీ) బాసరలో ఐఈఈఈ విద్యార్థి శాఖ ప్రారంభమైంది. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్(ఈసీఈ) విభాగ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ పరిశ్రమ నాయకులు, విద్యావేత్తలు, యువ పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ విభాగం ఐఈఈఈ రీజియన్ 10 స్టూడెంట్ యాక్టివిటీ చైర్‌పర్సన్ డాక్టర్ జి.శ్రీలక్ష్మీ మాట్లాడుతూ, ఐఈఈఈ ప్రాముఖ్యతను వివరించారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణల అభివృద్ధిలో ఐఈ ఈఈ కీలక పాత్ర పోషిస్తుందని, విద్యార్థులు ఐఈఈఈ కార్యకలాపాలలో చురుగ్గా పాల్గొని సాంకేతిక నైపుణ్యాలు వృత్తి పరమైన నెట్‌వర్కింగ్ అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐఈ ఈఈ హైదరాబాద్ విభాగం విద్యార్థి ప్రతినిధి శివిన్స్, వీసీ గోవర్ధన్, ప్రముఖ చిత్ర నిర్మాత దిల్‌రాజు, కాకతీయ సాండ్‌బాక్స్ సహ వ్యవస్థాపకుడు రాజరెడ్డి, లార్వెన్ ఏఐ సహ వ్యవస్థాపకుడు వైహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు.

బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు


మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అధికారి అశ్విని

ఆదిలాబాద్ రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని పిప్పలదరి గ్రామపంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన దహీగూడలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ అశ్విని ఆధ్వర్యంలో ఏ ర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులు నివసించే ఈ కుగ్రామంలో పిల్లలందరికీ రాజ్యాంగంలో నిర్దేశించబడిన సమాన హక్కులు పొందే విధంగా బాలల పరిరక్షణ కమిటీకి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పల్లెల నుంచి పట్టణం దాకా అన్నిచోట్ల బాలలపై జరుగుతున్న వేధింపులు దాడులను అరికట్టి బాలల హక్కులను పరిరక్షించడమే బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు యొక్క ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ కమిటీకి అంగన్వాడీ టీచర్ కన్వీనర్‌గా ఉంటూ కమిటీలో పంచాయతీ సెక్రెటరీ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఏఎన్ఎం, ఆశ వ ర్కర్, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామ పూజారి, కిషోర బాలికలు సభ్యులుగా ఉంటారనీ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇస్తారి మాట్లాడుతూ పిల్లలందరూ చక్కగా చదివి ఉన్నత స్థానాన్ని పొందాలని సమాజానికి గ్రామానికి మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీపీ


కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీపీ, టీఆర్ఎస్ పార్టీ నాయకులు

బోథ్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి కేటీఆర్‌ను బోథ్ మండల మాజీ ఎంపీపీ శ్రీనివాస్ శుక్రవారం హైదరాబాదులో కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసే వారి గెలుపు కోసం కృషి చేయాలని పేర్కొన్నట్లు మాజీ ఎంపీపీ తెలిపారు.



చేతిలో కర్రల సహాయంతో వాగు దాటుతున్న ఝరి వైద్య సిబ్బంది

వాగు దాటి.. వైద్య సేవలు!!

నార్నూర్ రూరల్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే ఏజెన్సీ ప్రాంత ప్రజలకు వైద్యం చేయడానికి ఆరోగ్య సిబ్బంది పడే కష్టాలు అన్నీ ఇన్నీ కావు. శుక్రవారం నార్నూర్ మండలంలోని ఝరి ప్రభుత్వ ఆస్పత్రి వైద్య సిబ్బంది మాలంగి ఎస్సీ గూడ, ఖారిక్ రావుగూడ గ్రామాలకు చేతిలో కర్రల సహాయంతో ప్రవహిస్తున్న వాగును దాటాల్సి వచ్చింది. ఆయా గ్రామాలకు వెళ్లి ఆర్ఎఫ్ఎస్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భారీ వర్షాల కారణంగా వచ్చే వ్యాధులు, ఇతర అంశాల పట్ల స్థానికులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. రోగులకు ఉచిత మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది సంజయ్ ఆడె, చంద్రకళ, వినోద్, మోతుబాయి పాల్గొన్నారు.





ఊరెళ్లే.. దారేది?

- జిల్లాలో అధ్వానంగా మారిన గ్రామీణ రోడ్లు
- వరద నీటిలో నుంచే ప్రమాదకరంగా ప్రయాణం
- పలుచోట్ల కోతకు గురైన దారులు.. మరమ్మతులు కరువు
- అత్యవసర సమయంలో అందని వైద్య సేవలు
- ప్రతియేటా వర్షాకాలంలో తీవ్ర గోసపడుతున్న ఆదివాసీ, గిరిజన గ్రామాలు

జిల్లాలో కురుస్తున్న.. భారీ వర్షాలు, వరదలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ఊరెళ్లే దారిలేక ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వం యేటా కోట్ల రూపాయలను మంజూరు చేస్తున్నా.. గ్రామీణ రోడ్లకు శాశ్వత పరిష్కారం చూపడం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కిలోమీటర్ల మేర రోడ్లు, కల్వర్టులు కొట్టుకు పోవడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచి పోతున్నాయి. అత్యవసర సమయంలో ఏదైనా ఆపద వస్తే ప్రమాదకరంగానే ప్రయాణం చేయాల్సి వస్తుంది.

ఆదిలాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధానంగా గాదిగూడ, నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, బేల, బజార్‌హత్నూర్, సిరికొండ ఏజెన్సీ మండలాల్లో రోడ్లు అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని ఏళ్ల తరబడి మొరపెట్టుకుంటున్నా.. ఐటీడీఏ అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదంటున్నారు. గుంతలుపడిన రోడ్లపై ప్రయాణం చేయాలంటే నిత్యం నరకయాతన పడాల్సి వస్తుందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రతియేటా వానాకాలం సీజన్‌లో మారుమూల గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపో యి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాల భారీన పడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు.

పట్టుతప్పితే ప్రమాదమే..

భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న వాగుల్లో నుంచి ప్రమాదకరంగా ప్రయాణం చేయాల్సి వస్తుంది. వరద నీటిని దాటే క్రమంలో పట్టు తప్పితే ప్రమాదం జరిగే పరిస్థితి కనిపిస్తుంది. ముఖ్యంగా ఇంద్రవెల్లి మండలంలోని చిత్తాబట్టా, జెండాగూడ, జైత్రంతాండ, మామిడిగూడ గ్రామాలతో పాటు బోథ్ మండలం నక్కలవాడ, లక్ష్మీపూర్, చింతగూడ, కొత్తపల్లి, ఉట్నూర్ మండలం మత్తడిగూడ, పిట్లగూడ, సుంగుగూడ, నర్సాపూర్ (బి), తాంసి మండలం హస్నాపూర్, తలమడుగు, గాదిగూడ, నార్నూర్, సిరికొండ, బజార్‌హత్నూర్ మండలాల్లోని పలు గ్రామాలకు వెళ్లే దారులు ప్రమాదకరంగా మారాయి. లోలెవల్ వంతెనలు, వాగుల వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో దాటే క్రమంలో ప్రయాణికులతో పాటు పశువులు నీటిలో గల్లంతవుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జైనథ్ మండలం తర్నం వాగులో ఓ యువకుడు కొట్టుకపోయి గల్లంతయ్యాడు. ప్రతియేటా వానాకాలం సీజన్‌లో ప్రమాదాలు జరుగుతున్నా.. అధికార యంత్రాంగం అప్రమత్తమైనట్లు కనిపించడం లేదు.

నిధుల కటకట..

పలు గ్రామాలకు వెళ్లే రోడ్లకు ఏళ్ల తరబడి మరమ్మతులు చేపట్టక పోవడంతో చిన్నపాటి వర్షాలకే అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. రోడ్ల నిర్మాణం, నిర్వహణలో ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్

(తరువాయి 6వ పేజీలో....)



ఈ ఫొటోలో.. భారీ వర్షాలకు వాగులు ఉప్పొంగి ప్రవహించడంతో ప్రమాదకరంగా వాగునీటిని దాటుతూ కనిపిస్తున్న వారిది ఉట్నూర్ మండలం మత్తడిగూడ గ్రామం. ఇటీవల గ్రామంలోని వృద్ధురాలు కుమ్ర పారుబాయి మృతి చెందడంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యాయి. గ్రామ సమీపంలో ఉన్న వాగు ఉప్పొంగి ప్రవహించడం తో వాగును దాటే పరిస్థితి లేక గంటల తరబడి వాగు ఒడ్డునే వేచి చూసే పరిస్థితి ఏర్పడింది. చివరి మజిలీకి ఆటంకాలు ఏర్పడడంతో గ్రామస్థుల సహకారంతో ప్రమాదకరంగానే వాగునీటిని దాటి అంత్యక్రియలను పూర్తి చేశారు.

ఈ ఫొటోలో వాగునీటిని ప్రమాదకరంగా దాటుతూ కనిపిస్తున్న వారు సిరికొండ మండలం కన్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తండాకు చెందిన బాలింత మీనాతో పాటు ఆమె కుటుంబ సభ్యులు.



ఇటీవల గర్భంతో ఉన్న మీనాను ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రసవం అనంతరం ఇంటికి తరలిస్తుండగా మార్గమధ్యమంలో వాగు వరద అడ్డురావడంతో 102 వాహనం వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో వైద్య సిబ్బంది బాలింతతో పాటు పసిబిడ్డను క్షేమంగా ఇంటికి చేర్చారు. ఇలాంటి ప్రమాదకర పరిస్థితులు చాలా మారుమూల గ్రామాలలో కనిపిస్తున్నాయి.

ప్రతియేటా వానకాలంలో ఇబ్బందులే..

: సిడ్మకి భీంరావు, మామిడిగూడ, ఇంద్రవెల్లి మండలం



ప్రతియేటా వానాకాలం సీజన్‌లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మామిడిగూడ వాగుపై వంతెనను నిర్మించడం లేదు. వానాకాలంలో ముఖ్యంగా గర్భిణులు, రోగులు ఆసుపత్రులకు సకాలంలో వెళ్లలేక పోతున్నారు. అత్యవసర సమయంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని వరద నీటిని దాటాల్సి వస్తుంది. అధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జిని నిర్మించాలి.



మంచి అలవాట్లపై ప్రదర్శించే నాటికను చేసి చూపుతున్న విద్యార్థినులు

ఆరోగ్యమే మహాభాగ్యం

- మంచి అలవాట్లతో జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలి : కలెక్టర్

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పాఠశాలలో భాగంగా విద్యార్థులకు మంచి అలవాట్లు తెలియచేయాలని, అంతేకాకుండా వ్యక్తిగత పరిశుభ్రత ప్రాధాన్యతను వివరించాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. ఆరోగ్య పాఠశాల అమలు తీరు తెన్నులపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల అనుభవాలు, సలహాలు, సూచనలు స్వీకరించారు. అయితే మన్నూర్ పాఠశాలకు చెందిన విద్యార్థి తమ గ్రామంలో జ్వరం వస్తే మందుల కోసం మెడికల్ లేదు కాని మద్యం దుకాణం ఉందని చెప్పడం చర్చనీయంశంగా మారింది. స్పందించిన కలెక్టర్ మెడికల్ దుకాణం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఈ సందరంగా పేర్కొన్నారు. అదేవిధంగా వివిధ పాఠశాలల విద్యార్థులు ఆరోగ్య పాఠశాల ద్వారా తెలుసుకున్న విషయాలను కలెక్టర్ ముందుంచడంతో ఆయన వారికి అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, మంచి అలవాట్లు చేసుకోవాలని సూచించారు. ఈ అంశాలపై వారికి అవగాహన కలిగేలా చూడాలన్నారు. ముఖ్యంగా జంక్ ఫుడ్ వల్ల కలిగే దుష్ప్రయోజనాలు, పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించాలన్నారు. విద్యార్థులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించేలా చూడాలని అధికారులకు సూచనలు చేశారు.

మున్సిపల్ ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ బాధ్యతల స్వీకరణ

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తయ్యేలా తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ప్రత్యేక అధికారి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం స్థానిక అంశాలను పుర కమిషనర్ సీవీఎన్ రాజును అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి.. వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ రాజేశ్వర్ మాట్లాడుతూ.. కలెక్టర్ సూచనల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలో ఎటువంటి సమస్యలు లేకుండా చూస్తామన్నారు.

'బతుకమ్మ చీరలను అందించడంలో ప్రభుత్వం విఫలం'

తలమడుగు, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో అమలు పరచడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకురాలు కాటిపెల్లి సునీత రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రతీ మహిళలకు రూ. 2,500 ఇస్తానని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. అలాగే బతుకమ్మ పండుగకు ప్రతీ మహిళకు బతుకమ్మ చీరను అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కేవలం స్వయం సహాయ సంఘాలకే బతుకమ్మ చీరలను ఇస్తామని చెప్పడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వ హాయంలో తెలంగాణ ఆడపడుచులకు ఆత్మ గౌరవంగా ప్రతి మహిళలకు చీరలు అందించడం జరిగిందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల నియంత్రణ

- పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ వెల్లడి
- త్వరలోనే విస్తృత అవగాహన కార్యక్రమాలు

ఆదిలాబాద్ టౌన్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. రానున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు జిల్లా పోలీస్ యంత్రాంగం పూర్తి సంసిద్ధమై ఉందని ఈ సందర్భంగా ఎస్పీ పేర్కొన్నారు. స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన నెలవారి నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని పోలీసు అధికారులతో పలు అంశాలపై చర్చించారు. గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో పూర్తి చేయడానికి సహకరించిన ప్రజలకు, కృషిచేసిన ప్రతీ ఒక్క పోలీసు సిబ్బంది, అధికారికి ఎస్పీ అభినందనలు తెలిపారు. కాగా, అసాంఘిక కార్యకలాపాలను పూర్తిగా రూపుమాపడానికి ప్రత్యేక కార్యచరణను అవలంబించనున్నట్లు ఎస్పీ ఈ సందర్భంగా పేర్కొన్నారు. అందులో భాగంగానే కల్తీ కల్లు, ఓపెన్ డ్రింకింగ్, గ్యాంబ్లింగ్, గేమింగ్, మట్కా లాంటి వాటిని పూర్తిగా రూపుమాపేల కృషి చేయాలన్నారు. గ్రామాల పరిధిలో రాజ్యాంగ విరుద్ధంగా వీడీసీలు ఎలాంటి కార్యకలాపాలను నిర్వహించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. గంజాయి రహిత జిల్లాగా నిర్మించడానికి జిల్లాలోని ప్రతి ఒక్క పోలీసు అధికారి పూర్తి స్థాయిలో సమాచార వ్యవస్థను పటిష్టం చేసుకుని గంజాయిని అరికట్టాలని తెలిపారు. ప్రజలకు, విద్యార్థులకు చట్టం పట్ల, నేరాల పట్ల అవగాహన కల్పించే విధంగా నూతన కార్యక్రమాలను వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ట్రాఫిక్ సైబర్ లపై, ఆంటీ డ్రగ్ క్లబ్, మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళ, రోడ్ సేఫ్టీ క్లబ్, కాకి కిడ్స్ లాంటి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు వివరించారు. అదేవిధంగా వడ్డీ పేరుతో ఇబ్బందులకు గురిచేసే వ్యాపారుల పట్ల చట్ట ప్రకారం కఠినమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతేకాకుండా నెలరోజుల వ్యవధిలో జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 30 మంది సిబ్బంది అధికారులకు ప్రశంసా పత్రాలు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్‌సింగ్, డీఎస్పీలు పోతారం శ్రీనివాస్, ఎల్. జీవన్ రెడ్డి, సీహెచ్ నాగేందర్, హసీబుల్ల, కమతం ఇంద్ర వర్ధన్, సీఐలు, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్లు, ఎస్సైలు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్, హాజరైన పోలీసు అధికారులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తాంసి రూరల్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ ఆసుపత్రుల కంటే ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు ఉన్నాయని ప్రతీ ఒక్కరు ప్రభుత్వ వైద్యాన్ని సద్వినియోగం పరుచుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ జి.నగేష్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రూపాయలు రూ.20 లక్షలతో నిర్మించిన హెల్త్ సబ్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ పల్లెలో సబ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లయితే మరింత మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించవచ్చు అన్నారు. ముఖ్యంగా మహిళలు ప్రభుత్వ వైద్యశాలల్లోనే ప్రసవాలు జరిగేటట్లు చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న పథకాల పట్ల ప్రజల్లో పూర్తిస్థాయి అవగాహన లేకుండా పోతుందని ఈ విషయం పట్ల అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక విద్య వైద్యానికి పెద్దపీట వేశారని ప్రతీ గ్రామంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందించాలనే సంకల్పంతో ముందుకెళ్లారన్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, సహకార సొసైటీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, పీఆర్‌ఈఈ శివరాం, కాంట్రాక్టర్ దేవ్ రావు, నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



తాంసిలో సబ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే అనిల్



నెమలి ఈకల టోపీని తీసుకెళ్తున్న ఆదివాసీలు

గుస్సాడీల కోసం నెమలి టోపీలు

బోథ్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): మరో నెల రోజుల్లో రానున్న దీపావళి పండుగ సందర్భంగా ఆదివాసీ గూడెంలో గుస్సాడీ నృత్యాలు ప్రారంభమవుతాయి. అయితే గుస్సాడీలు ధరించే నెమలి ఈకల టోపీలు మండలంలోని పార్డి(బి) గ్రామంలో తయారవుతుంటాయి. వివిధ గ్రామాల ఆదివాసీలు ఈ గ్రామానికి వెళ్లి నెమలి ఈకల టోపీలు తయారు చేయించుకుంటారు. అంతేగాక ఒక్కో టోపీ తయారీకి దాదాపు పది వేల రూపాయల వరకు ఖర్చవుతుందని నెమలి ఈకలను తీసుకువెళుతున్న మాన్కాపూర్ గ్రామ యువకులు తెలిపారు. ఒక్క నెమలి ఈకకు పది రూపాయల చొప్పున తీసుకుంటారని ఒక్క టోపీ పది సంవత్సరాలు వరకు ఉంటుందన్నారు.

బయటపడ్డ నకిలీ, గడువు ముగిసిన నిత్యావసర సరుకులు

- గుట్టురట్టు చేసిన ఆదివాసీ సంఘాలు
- గాదిగుడ మండల కేంద్రంలో ఘటన

మరిన్ని వివరాలు 6వ పేజీలో....

కొలాం గిరిజనుల అభివృద్ధికి కృషి చేయాలి : ఎంపీ

భీంపూర్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): కొలాం గిరిజనుల (పీవీటీజీ) అభివృద్ధికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కృషి చేయాలని ఎంపీ గోడం నగేష్ అన్నారు. ఆయన శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఆత్మ చైర్మన్ కామన్ అశోక్, మాజీ జడ్పీటీసీలు కుంరా సుధాకర్, తాటి పెళ్లి రాజు, మాజీ ఎంపీపీ కుడిమేత సంతోష్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, న్యాయవాది కేమ శ్రీకాంత్‌లతో కలిసి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పీఎం జన్ మన్ కింద మంజూరైన 500 ఇళ్ల పట్టాల పత్రాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దేశంలో మూడు కోట్ల మంది గిరిజనులుంటే.. అందులో రెండు కోట్ల మంది పివిటిజీకి చెందిన వారు ఉన్నారని గుర్తు చేశారు. మండలంలో ఉన్న కొలాం గిరిజనులకు అందరికీ కూడా ఇళ్లు మంజూరు చేస్తామని పేర్కొన్నారు. ఆదివాసీలు ఎక్కువగా రక్త హీనతతో బాధపడుతారని అలాంటి వారు పౌష్టిక ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకుముందు బీంపూర్, కరంజీ(టి)లలో ఐటిడిఎ నిధులతో నిర్మించిన పల్లె దవాఖానాలను, మర్కాగూడలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనంలను ప్రారంభించారు. బీఆర్ఎస్, బీజేపీ మండల అధ్యక్షులు మేకల నాగయ్య, అంకం అశోక్, నాయకులు పాల్గొన్నారు.



భీంపూర్‌లో లబ్ధిదారులకు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎంపీ నగేష్, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బీజేపీలో చేరికలు

భీంపూర్: మండలంలోని గోముత్రిలో శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు ఎంపీ నగేష్ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. ఇందులోలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతంగే బ్రహ్మానంద్, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపెల్లి రాజు, మండల అధ్యక్షుడు అంకం అశోక్, ప్రధాన కార్యదర్శులు గుర్ల నారాయణ, కొకటి వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.



మందబొగుడలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ నవీన్‌రెడ్డి

విద్యార్థులకు వైద్య పరీక్షలు

బోథ్, సెప్టెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మందబొగుడ గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు విద్యార్థులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో వచ్చే వ్యాధుల గురించి వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రతపై గ్రామస్తులు అవగాహన కలిగించారు. ఏఎన్ఎం అర్చన, ఎమ్మెల్యే హెచ్ పి శృతి, తదితరులు పాల్గొన్నారు.

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ బాలికల ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యధికారి సద్దాం మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, ఎ. సంతోష్, స్వర్ణలత, హెల్త్ అసిస్టెంట్, శ్రీనివాస్ రెడ్డి, జీఎన్ఎం కావేరి తదితరులు ఉన్నారు.



లఖంపూర్ ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాలలో..

సరిహద్దుల్లో పెద్దపులి అలజడి

- మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాలో ఘటన
- పులి దాడిలో ముగ్గురి మృతి
- భయాందోళనలో జిల్లా సరిహద్దు గ్రామాలు

ఆదిలాబాద్, సెప్టెంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా సరిహద్దు ప్రాంతం మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లాలో పెద్దపులి వరుసదాడులు గురువారం రాత్రి కలకలం రేపాయి. ఒకేరోజు వేర్వేరు చోట్ల జరిగిన పులిదాడుల్లో ఇద్దరు మృతి చెందారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా చిమూర్‌తాలుకాలోని మౌజాలావారి గ్రామానికి చెందిన విద్యాకైలాస్ మస్రమ్(40) అనే వివాహిత పొలంలో వ్యవసాయ పనులు చేస్తుండగా.. అకస్మాత్తుగా మహిళ మెడపై పులిదాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందింది. అలాగే లకాపూర్ గ్రామానికి చెందిన పశువుల కాపరి సునిల్‌రౌత్ (32) అనే వ్యక్తి బ్రహ్మపురి అటవీ ప్రాంతంలో పశువులను మేపేందుకు వెళ్లగా.. పొదల్లో దాక్కొని ఉన్న పులిదాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అలాగే సిందేవాహిని తాలుకాలోని గడ్బోరి గ్రామానికి చెందిన ప్రశీల్ బాబన్‌మంకర్(9) అనే బాలుని గురువవారం అర్ధరాత్రి ఇంటి ప్రాంగణం నుంచి చిరుతపులి అటవీ ప్రాంతంలోకి లాకెళ్లింది. ఆచూకీ కోసం వెతుకగా అటవీ ప్రాంతంలో మృతదేహం దొరికింది. దీంతో గ్రామస్థులు వన్యప్రాణుల ముప్పు నుంచి కాపాడాలంటూ అధికారుల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని అడవుల్లో పులి హడలెత్తించడంతో జిల్లాలోని సరిహద్దు గ్రామాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలంగడుపుతున్నారు.



చెట్లపొదల్లో సునిల్‌రౌత్ మృతదేహం